పేటను సుందరీకరిస్తాం

అచ్చంపేట: పట్టణాన్ని అన్ని విధాలా సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మున్సిపల్ 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ్మాగౌడు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా బడ్జెట్ వివరాలను కమిషనర్ శ్యాంప్రసాద్ చదివి వినపించారు. బడ్జెట్‌కు సంబంధించిన పలు అంశాలపై సభ్యులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. మల్లంకుంటను ట్యాంక్‌బండ్‌గా మరింత అభివృద్ధి చేసేందుకు పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. తాగు నీటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యంలో స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్నారు. గతంలో మంజూరై ప్రగతిలో ఉన్న పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేయాలన్నారు. మల్లంకుంట ప్రధాన రహదారిపై ఉన్న ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి మున్సిపల్‌కు ఆదాయం పెంచుతామని వివరించారు. సీతారాల గుట్టులోని ప్రభుత్వ స్థలంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పశువుల సంతకు శాశ్వత స్థలం కేటాయించాలని సమావేశంలో సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరిశంకర్, మన్నుప్రసాద్, రమేష్‌రావు, సునీత, తగురం శ్రీనివాసులు, అంతటి శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బడ్జెట్ అంచనాలు

2024–25 ఆర్థిక వార్షిక బడ్జెట్ అంచనా రూ. 8 కోట్ల 62 లక్షల17 వేలుగా ప్రకటించారు. 2025 మార్చి నాటికి మిగులు బడ్జెట్ లేకపోగా లోటు బడ్జెట్ రూ.64 లక్షల 51వేలుగా ఉంది. పన్నులు, కిరాయిలు, ఫెనాల్టీ, ట్రేడ్ లైసెన్స్‌లు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ ద్వారా రూ.7కోట్ల 16 లక్షల 45 వేలు, నాన్‌గ్రాంటు ప్లాన్ల ద్వారా రూ.కోటి 12 లక్షలు, ప్లానింగ్ గ్రాంట్ రూ.45 లక్షలు ఆదాయం సమకూరుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మిగులు నిల్వ రూ.71.08 లక్షలు ఉంది.

ఈ ఏడాది మున్సిపల్ ఖర్చులు..

మున్సిపల్ కార్యాలయం బడ్జెట్ ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉండటం విశేషం. మున్సిపల్ ఆదాయంలో అత్యధికంగా జీతాలు, వేతనాల ఖర్చు రూ.3 కోట్ల 12 లక్షల 85 వేలు ఉండటం విశేషం. శానిటేషన్ విభాగం ఖర్చులు కూడా రూ. కోటి 10 లక్షల14వేలు కేటాయించారు. కరెంటు చార్జీల ఖర్చులు రూ.63.40లక్షలు, గ్రీన్ బడ్జెట్ రూ.81.65లక్షలు, ఇంజనీరింగ్ విభాగం ఖర్చులు రూ.99.13 లక్షలు, పరిపాలన నిర్వహణ ఖర్చులు రూ.41. 86 లక్షలు, టౌన్ ప్లానింగ్ రూ.5.25 లక్షలు, నాన్ ప్లాన్ గ్రాంటు రూ. కోటి 15 లక్షల 60 వేలు, ప్లానింగ్ గ్రాంటు రూ.65 లక్షలుగా ప్రకటించారు. బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు.

యాదవుల అభ్యున్నతికి కృషి

అచ్చంపేట: యాదవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని చంద్రారెడ్డి గార్డెన్‌లో యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ యాదవ భవనం కోసం రూ.కోటి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో రూ.25లక్షలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం యాదవుల భవనం కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కాశన్నయాదవ్, నర్సయ్యయాదవ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు రథోత్సవం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 24వ తేదీన శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ జంగం జీవన్ కుమార్ పేర్కొన్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పలు గ్రామాల నుంచి తరలివచ్చారు. అర్చకులు కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కొల్లాపూర్: పంచాయతీరాజ్ శాఖ–స్వామి రామానంద తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్ అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కోఆర్డినేటర్ భీమయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, పదోతరగతి చదివిన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతి కల్పిస్తామని వివరించారు. ఔత్సాహికులు మార్చి 1వ తేదీలోగా యాదాద్రి జిల్లాలోని పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లో గల స్వామి రామానంద తీర్థ ట్రస్టులో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నం. 9848908059, 9133908000కు ఫోన్ చేయాలని కోరారు.

డిగ్రీ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన




కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. వనపర్తి జిల్లా పరిధిలోని శ్రీరంగాపూర్ ఆలయాన్ని వారు సందర్శించారు. ఆలయ విశిష్టత, పురాతన కట్టడాలు, రంగసముద్రం రిజర్వాయర్ నిర్మాణాలకు సంబంధించిన అంశాలను శ్రీరంగాపూర్ ఆలయంపై పరిశోధనలు చేసిన అధ్యాపకుడు దాసరి శివుడు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి



కల్వకుర్తిరూరల్: దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో హక్కుల సాధన కోసం పోరాడుతున్న అన్నదాతలపై జరుగుతున్న పాశవిక దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతు సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీఓ శ్రీను నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర ఉద్యమిస్తున్న రైతులపై దాడులు చేయడం అప్రజాస్వామికం అన్నారు. వెంటనే దాడులు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో తర్నికల్ మాజీ సర్పంచ్ పాండు గౌడ్, చెన్న స్వామి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనుల సర్వే నిలిపివేయాలి



బల్మూర్: మండల కేంద్రం సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్ పనుల కోసం చేస్తున్న సర్వేను వెంటనే నిలిపివేయాలని గురువారం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ భాస్కర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంలో ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. రిజర్వాయర్ నిర్మాణంలో బల్మూర్ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 1800 ఎకరాల రైతుల భూములు ముంపునకు గురవుతాయని వివరించారు. దీంతో బాధిత కుటుంబాలకు జీవనోపాధి లేక వీధిన పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రిజర్వాయర్ పనులను ఆపాలని లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోయారు.

భక్తిశ్రద్ధలతో రామగిరి సీతారాముల కల్యాణం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణతంతును జరిపించారు. ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం వారాల మైసమ్మ శివాలయంలో పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. 23 రాత్రి రామగిరి వద్ద రథోత్సవం ఉంటుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలస్వామి, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, సతీష్, హరీష్‌రెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్చకుడికి వేదమూర్తి బిరుదు ప్రదానం

కందనూలు: ఇటీవల శ్రీశైలం మహా క్షేత్రంలో ఐదు రోజులుగా నిర్వహించిన మహారుద్ర శత చండి వేద స్వాహాకార మహా కుంభాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దేవాలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విజయ్ కుమార్ శాస్త్రిని వేదమూర్తి బిరుదుతో సత్కరించారు. గురువారం కాశిమహా పీఠం పీఠాధిపతి జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివచర్యా మహా స్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు డాక్టర్ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వాములు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గోపూజ, వేద పారాయణం, జపములు, మహాన్యాస పూర్వక రుద్ర పారాయణం, గణపతి, చండీహోమ వేదపారాయణం, శివాజీ ఉత్తర రాజాగోపురం శిఖర ప్రతిష్ఠ క్రతువులలో ఉత్తమవేద పారాయణాన్ని శాస్త్రోక్తంగా పారాయణ పఠనం చేయడంతో వేదమూర్తి బిరుదు అందజేసినట్లు అర్చకుడు తెలిపారు. అనంతరం కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారు, పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతి మహా స్వామి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వేద పండితులతో పాటు శ్రీశైల దేవాలయ ఉప ప్రధాన అర్చకులు గవ్వ మఠం శ్రీశైలం పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయ్‌కుమార్

పీఆర్సీలో సముచిత స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న రవికుమార్

మన్ననూర్: ప్రాణాలను సైతం లెక్క చేయకుండ అటవీశాఖలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పీఆర్సీలో సముచిత స్థానం కల్పించాలని అటవీశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మన్ననూర్‌లోని అటవీశాఖ ఈసీ సెంటర్‌లో సహచర ఉద్యోగులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ ఉద్యోగులు, సిబ్బంది రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వ సంబంధిత ఆస్తులకు నిరంతరం రక్షణగా ఉంటున్నారని అన్నారు. యూనిఫాం ఉద్యోగులతో పాటు అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న వారికి కూడా సమానమైన వేతనాలు, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ: 50 లక్షలకు తగ్గకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆరోగ్య భద్రత కార్డులు, అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాని కోరారు. సమావేశంలో యూనిట్ సెక్రెటరీ పద్మారావు, మదన్, ముజీబ్‌ఘోరీ, భగ్న, రాంబాబు, వాల్యా, హన్మంతు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులతో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ

కందనూలు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానంలో ఆకాంక్షించారు. రాబోయే రోజులలో కళాశాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. 1964లో ప్రారంభించిన కళాశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, త్వరలోనే పునర్నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ, అధ్యాపకులు నర్సింహులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై బండలాగుడు పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాతన బుగ్గ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఎంతో పవిత్రమైందన్నారు. ప్రతి ఒక్కరు కూడా భక్తిమార్గంలో ఉండాలన్నారు.

విజేతలు..

తాడూరు మండలం యాదిరెడ్డిపల్లికి చెందిన అఖిలేష్‌రెడ్డి ప్రథమ బహుమతి రూ.50వేలు, వల్వాకల కర్నూల్ జిల్లాకు చెందిన తిరుమలేష్ రెండో బహుమతి రూ.40 వేలు, పెద్దవడ వనపర్తి జిల్లాకు చెందిన గోపాలకృష్ణ మూడో బహుమతి రూ.30 వేలు, గద్వాలకు చెందిన నారాయణ నాల్గో బహుమతి రూ.20 వేలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు విజయమ్మ, వెంటకయ్య గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



కల్వకుర్తిరూరల్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో నాగర్‌కర్నూల్ జిల్లా పెన్షనర్ల అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం చొరవ తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్ర హ్మాచారి, అంజనయ్య, పెన్షనర్లు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఉప్పునుంతల: యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కుందేళ్ల శంకర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు, అదేవిధంగా జిల్లా పరిధిలో ఉన్న నామినేటెడ్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బొలెరో వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: బొలెరో వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తూడుకుర్తి గ్రామానికి చెందిన ఆంజనేయులు జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి బయటకు వస్తుండగా బొలేరో వాహనం ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు స్వల్పగాయాలయ్యాయి.

నష్టపరిహారం చెల్లించాలని వినతి

వెల్దండ: మండలంలోని అంకమోనికుంట గ్రామానికి చెందిన రైతు గుండ్లపల్లి వెంకట్‌నారాయణరెడ్డికి సంబంధించిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడంతో గురువారం విద్యుత్ అధికారులకు రైతు కలిశారు. నష్టపరిహారం చెల్లించాలని అధికారులు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైర్లకు తగిలి ఆవు విద్యుత్ షాక్ గురైనట్లు వివరించారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాడి పశువులను కాపాడుకుందాం

చారకొండ: పాడి పశువులను కాపాడుకుందామని మండల పశువైద్య అధికారి శివకుమార్ అన్నారు. గురువారం మండలంలోని జూపల్లిలో పాడి ఆవులు, దూడలకు థైలేరియా రోగ నిరోధక టీకాలను వేశారు. మొత్తం గ్రామంలో 93 ఆవులకు టీకాలు వేసినట్లు వైద్యుడు తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ మదర్, పశు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

వెల్దండ: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్, భర్కత్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండతీవ్రత నుంచి మొక్కలను రక్షించుకోవాలన్నారు. జాతీయ ఉపాధి హామీ కూలీలతో ప్రతి మొక్కకు నీరు అందించాలని సిబ్బందికి సూచించారు. పల్లె పకృతి వనాల్లో మొక్కలను రక్షించుకోవడానికి కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అదేవిధంగా రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలను పాదులు చేసి నీరు అందించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఉపాధి హమీ పథకం ద్వారా కూలీ పనులు కల్పించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఫీల్డ్ అసిస్టెంట్లు అలివేలు, కృష్ణయ్య, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


మొక్కలకు నీరు పోయిస్తున్న ఎంపీడీఓ

మొక్కలు ఎండకుండా చర్యలు..

తెలకపల్లి: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని కమ్మరెడ్డిపల్లి, గోలగుండం, లక్నారం, జంగమోనిపల్లి గ్రామాలను ఆయన సందర్శించి నర్సరీలను పరిశీలించారు. వేసవికాలంలో నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ మల్లేష్, టీఏ మోహన్ ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


సూరాపూర్ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓ

లింగాల: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నాగార్జున రెడ్డి రైతులను కోరారు. గురువారం మండలంలోని సూరాపూర్ శివారులో రైతులు సాగు చేసిన వరి పంటను ఏఓ పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల వ్యాప్తంగా 2,450 ఎకరాలలో వరిని సాగు చేశారన్నారు. ప్రస్తుతం పిలక దశలో ఉందని, కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉంటుందని దీని నివారణకు ఎకరాకు 35 కిలోల యూరియాతో పాటు కర్బాఫ్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 5 కిలోల చొప్పున వాడాలని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ చీన్యానాయక్ పాల్గొన్నారు

వరి పంటల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో యాసంగి వరి పంటలను గురువారం ఏఓ, ఏఈఓలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట 40–60 రోజుల పిలక దశలో ఉందన్నారు. ఈ సమయంలో బ్యాక్టిరియా ఆకు ఎండు, వేరు కుళ్లు తెగులు వస్తాయన్నారు. దీంతో ఆకుల అంచులు పసుపుగా మారి కొనలు ఎరుపుగా మాడి ఎండిపోతాయన్నారు. దీని నివారణకు ఎకరాకు ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, ప్రాసికొనజాల్ 200 మిల్లీ గ్రాములు, అదేవిధంగా కాండం తొలుచు పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు పిచికారి చేసుకొని పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, రైతులు నక్క బాలస్వామి, తోట శేఖర్, రవీందర్, ఈశ్వరయ్య, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


కల్వకుర్తి మండలం సుద్దకల్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్, తాండ్ర ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బాలమణి, తాండ్ర హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జంగయ్య, రామకృష్ణ, శివకుమార్, పావని పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంగా కీర్తి, ఎంఈఓగా సంపంగి జీవిత, విద్యాధికారిగా అర్జున్, కలెక్టర్‌గా రజితలు వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన వారికి కాంప్లెక్స్ హెచ్‌ఎం చాందుపాషా, హెచ్‌ఎం వెంకటరామరెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గోవిందాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


ప్రారంభిస్తున్న వెంకటయ్యగౌడ్

వెల్దండ: మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో గురువారం సీసీరోడ్డు నిర్మాణ పనులను సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తో గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాయకులు పుల్లారెడ్డి, కిష్టాలు, నారాయణ, హమీద్, శ్రీను, జంగయ్య, మహేష్, రాజు, శ్రీను, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తాడూరు: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు గుంతకోడూరు, అల్లాపూర్ గ్రామాలను ఆయన సందర్శించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలని, పనులపై కూలీలకు అవగాహన కల్పించి ప్రతి గ్రామం నుంచి వందకు తగ్గకుండా కూలీల సంఖ్య పెంచాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు అరిట్టాలని కార్యదర్శులకు సూచించారు.

విషపు ఎర వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూరులో గురువారం పాలెం వ్యవసాయ కళాశాల రావేఫ్ విద్యార్థులు రైతులకు విషపు ఎర వినియోగంపై అవగాహన కల్పించారు. విషపు ఎర వినియోగం, దాని తయారీ, విధానంను ప్రదర్శించారు. మొక్కజొన్నలో కత్తెరపురుగు ఉధృతి ప్రథమ దశలో తగ్గించడానికి ఎకరాకు 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం కలిపి మిశ్రమంగా చేసుకోవాలని సూచించారు. దీనికి 100 మిల్లీ లీటర్ల డయోడికార్స్ రసాయనాలను కలిపి ఉండలుగా చేసుకుని మొక్కజొన్న చేలో సాయంకాలం అక్కడక్కడ వేయడం వల్ల కత్తెర పురుగు ఉధృతిని తగ్గుతుందన్నారు. మట్టి నమూనాల ఆధారంగా పంటలు వేస్తే మంచి దిగుబడి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు తేజశ్విని, లావణ్య, సమత, అఖిలా రెడ్డి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలో సివిల్ సప్లయ్ గోదాం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సివిల్ సప్లయ్ గోదాం సొంత భవనం లేక అద్దె భవనంలోనే కొనసాగుతోంది. దీంతో సరుకుల నిల్వ చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని 38 గ్రామాలతో పాటు కోడేరు మండలంలోని 7 గ్రామాలకు ఈ గోదాం నుంచే ప్రతి నెల రేషన్ బియ్యం సరఫరా అవుతున్నాయి. రేషన్ బియ్యం నిల్వ చేసుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి నెల గోదాం నుంచి రేషన్ బియ్యం సరఫరా సక్రమంగా కాకపోవడంతో కొన్ని గ్రామాలలో రేషన్ బియ్యం పంపిణీ ప్రతి నెల మొదటి వారంలో ఇవ్వడం లేదని రేషన్‌కార్డుదారులు వాపోయారు. మండలంలో 14 వేల తెల్ల రేషన్ కార్డులు, ఇతర కార్డులు 2 వేలు ఉన్నాయి. దాదాపు 15 లారీల సామర్థ్యం గల గోదాం అవసరమున్నా మూడు లారీల బియ్యం మాత్రమే నిల్వ చేసేందుకు గోదాం ఉండటంతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పట్టించుకుని సివిల్ సప్లయ్ గోదాం కోసం నిధులు మంజూరు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.


పెద్దకొత్తపల్లిలో అద్దె భవనంలో ఉన్న సివిల్ సప్లయ్ గోదాం భవనం